క్లుప్తంగా

ఆర్మీలో మండలవాసి ఘనత



వర్ధన్నపేట: ఆర్మీలో మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన జెల్ల శ్రీనివాస్ ఘనత సాధించాడు. ఆర్మీ చీఫ్ నుంచి కమెండేషన్ కార్డ్‌తో సత్కారం అందుకుని గ్రామ కీర్తిని దేశ నలుమూలల చాటారు. శ్రీనివాస్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రమంలోనే ఆర్మీ చీఫ్ కమెండేషన్ కార్డ్‌తో సత్కరించారు. శ్రీనివాస్‌కు నాయక్ నుంచి హవల్దార్‌గా ఉద్యోగోన్నతి రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సన్మానం



రాయపర్తి : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన నేపథ్యంలో ఈదులకంటి రవీందర్‌రెడ్డిని ఆ పార్టీ నాయకులు మండల కేంద్రంలో మంగళవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. రవీందర్‌రెడ్డి ఎన్నికపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కుందూరు రాంరెడ్డి, మిల్కూరి దామోదర్‌రెడ్డి, పంతంగి యాకన్న, బూత్ కన్వీనర్ గిరగాని వేణు పాల్గొన్నారు.

అభినందన



వర్ధన్నపేట: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటిన మండలంలోని ఉప్పరపల్లి క్రాస్ సమీపంలోని ఐనవోలు మండల పరిధిలోని మహాత్మ జ్యోతిరావు పూలే (ఎంజేపీ) బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులను, ఏఈటీపీ అశోక్, పీఈటీ సందీప్‌లను పాఠశాలలో హెచ్‌ఎం రాజేంద్రచారి ఆధ్వర్యంలో మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. 6వ రాష్ట్ర స్థాయి అండర్ 14 రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో తమ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు తెలిపారు. విద్యార్థులు యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

గీసుకొండ : డ్రంకెన్ డ్రైవ్ కేసులో చిక్కిన ఒకరికి న్యాయస్థానం రెండ్రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా మద్యం మత్తులో వాహనం నడుపుతూ బెజ్జంకి పాండురంగాచారి చిక్కినట్లు చెప్పారు. బ్రీతింగ్ అనలైజర్‌తో పరీక్షించగా 140 శాతం నమోదైనట్లు తెలిపారు. పాండురంగాచారిని కోర్టులో మంగళవారం హాజరుపర్చగా వరంగల్ సెకండ్ క్లాస్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ జి.వీరస్వామి శిక్ష విధించినట్లు వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్, నగదు స్వాధీనం



నెక్కొండ : మండలంలోని అలంకానిపేటలో పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి రూ.26,050 నగదుతోపాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై షేక్ జానీపాషా పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పేకాట స్థావరంపై పక్కా సమాచారం అందడంతో దాడి చేసినట్లు తెలిపారు. గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గ్రామానికి చెందిన ఎడ్ల లక్ష్మీనారాయణ, గాజుల జనార్దన్, పోరండ్ల ప్రశాంత్, భూపతి వీరేశం పేకాట ఆడుతూ చిక్కినట్లు చెప్పారు. పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామన్నారు. దాడిలో పోలీసు సిబ్బంది ఖాజా, రాకేశ్, వెంకన్న పాల్గొన్నారు.

బాలరాముడి దర్శనానికి తరలిన భక్తులు



రాయపర్తి : అయోధ్యలోని బాలరాముడి దర్శనానికి మండలం నుంచి రాపాక ప్రశాంత్ ఆధ్వర్యంలో భక్తులు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ముందుగా టపాసులు కాల్చుతూ సంబరాలు నిర్వహించారు. అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. వెళ్లిన వారిలో శ్రీనివాస్, రాజేందర్, సందీప్, వెంకన్న, రాములు, బ్రహ్మచారి, నాగయ్య, యాకూబ్ తదితరులున్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



సంగెం : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



గీసుకొండ : కొనాయమాకుల వద్ద రహదారిపై..



వర్ధన్నపేట:ఎస్సైకి ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు



రాయపర్తిలో..

సంగెం : సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి అన్నారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. అనంతరం మాధవరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి హరిబాబు, బిక్కిరెడ్డి సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండలంలోని కొనాయమాకుల క్రాస్ వద్ద రహదారిపై ధర్నా చేశారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, నాయకులు సాయిలి ప్రభాకర్, కూసం రమేశ్, నాగారపు స్వామి, ఆకుల రుద్రప్రసాద్, వజ్ర రాజు, వెంకటేశ్, భద్రునాయక్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

వర్ధన్నపేట : మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య ఆధ్వర్యంలో ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వెంకటయ్య మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిపై సుమన్ వ్యాఖ్యలను ఖండించారు. కార్యక్రమంలో నాయకులు మల్లెపాక సమ్మయ్య, కందిక ఎల్లస్వామి, దుబ్బ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : బాల్క సుమన్‌పై కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నపాక ఎల్లయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిర్ర మల్లయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహమూద్, నాయకులు గబ్బెట బాబు, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

● ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట: ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు తూచా తప్పకుండా అమలు చేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం 60 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు అమలులోకి వచ్చాయని, గృహలక్ష్మి ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలకు కసరత్తు జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఛీ కొట్టినా వారు మాత్రం తాము ఇంకా అధికారంలో ఉన్న భ్రమలో ఉన్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై బాల్కసుమన్ అనుచిత వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సుమన్ క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో తెలంగాణ ప్రజలు ఊరుకోబోరని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో అవినీతికి తావు ఉండదని ఎవరు అవినీతికి పాల్పడ్డ ఊరుకునే ప్రసక్తే లేదని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అవినీతి అక్రమాలను వెలికి తీసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, కౌన్సిలర్ సమ్మెట సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌పై వ్యాఖ్యలు దుర్మార్గం



వర్ధన్నపేట : మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, పట్టణ అధ్యక్షుడు పులి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి చావు అంచుల వరకు వెళ్లి ప్రత్యేక రాష్ట్రం సాధించారని గుర్తు చేశారు. సీఎంగా కేసీఆర్ పదేళ్లలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లారని చెప్పారు. సమావేశంలో నాయకులు సిలివేరు కుమారస్వామి, కొండేటి శ్రీనివాస్, బొచ్చు జ్యోతి యాదగిరి, కన్నం కుమారస్వామి, కొండేటి భాస్కర్, నందిసాక బాస్కర్, కంజర్ల రవీందర్, పిట్టల రాజు, మల్లెపాక బాస్కర్, పాక సుజాత, సాయిలు, కొండేటి రాజు పాల్గొన్నారు.

రైతులకు పంట పరిహారం చెల్లించండి

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : గతేడాది అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సంపేట నియోజకవర్గంలో మార్చి 2023లో కురిసిన అకాల వర్షాలకు 39,500 మంది రైతులు 46 వేల ఎకరాల్లో పంట నష్టపోగా నాటి సీఎం కేసీఆర్ రూ.46 కోట్ల రైతులకు పరిహారం అందించారని గుర్తు చేశారు. ఏప్రిల్‌లో అకాల వర్షాలకు నల్లబెల్లి, చెన్నారావుపేట, దుగ్గొండి, ఖానాపురం మండలాల్లో 2746 మంది రైతులు 2917 ఎకరాల్లో పంట నష్టపోగా నాటి ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల చొప్పున మంజూరు చేసిందన్నారు. నల్లబెల్లి మండలంలో అత్యధికంగా పంటలు నష్టపోయినట్లు తెలిపారు.

మహిళా సంఘాల భవనాలు నిర్మించుకోవాలి



నర్సంపేట : ముఖ్యమంత్రి ఎస్‌డీఎఫ్ నుంచి మంజూరైన నిధులతో వెంటనే మహిళా సంఘాల భవనాలు నిర్మించుకోవాలని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సూచించారు. ప్రొసీడింగ్ పత్రాలను మహిళా సంఘాలకు ఆయన మంగళవారం పంపించారు. పంపారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. గతేడాది అక్టోబర్‌లో జీఓ నంబర్ 452 ద్వారా రూ.18.95 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఆ నిధులతో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వీఓ సంఘాల భవనాలు నిర్మించాల్సి ఉందన్నారు. మహిళా సంఘాలకు ఇచ్చిన మాట ప్రకారం నిధులను మంజూరు చేయించినట్లు చెప్పారు. నిధులు వెనక్కు వెళ్లకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి అధికారులతో పనులను త్వరగా పూర్తి చేయించుకోవాలని కోరారు.

నేడు సెంట్రల్ సెక్రటేరియట్ అధికారుల రాక

దుగ్గొండి : నేడు (బుధవారం) మండల పరిషత్ కార్యాలయానికి సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసు అధికారులు రానున్నారని ఎంపీడీఓ కృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకరోజు శిక్షణలో భాగంగా మండలంలోని పలు కార్యాలయాలను సందర్శించి వివరాలు తెలుసుకుంటారని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



చెన్నారావుపేట : మండలంలోని పాత మగ్దుంపురం గ్రామానికి చెందిన ఆకుల రవీందర్ గౌడ్, ములుక తిరుపతి, మాదాసి ఎల్లస్వామి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంగళవారం పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సిద్దన రమేశ్, తప్పెట రమేశ్, ననుమాస కరుణాకర్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి..

నల్లబెల్లి : సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా సానుభూతిపరుడు, నారక్కపేట మాజీ సర్పంచ్, పీఏసీఎస్ డైరెక్టర్ చెన్నమల నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు చంద్రన్న మంగళవారం పరామర్శించారు. తొలుత నర్సయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రన్న మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, ఆరెల్లి కృష్ణ, నున్న అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న హకీమ్ నవీద్

నర్సంపేట రూరల్ : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో బి.మోహన్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సంఘం డివిజన్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి హకీమ్ నవీద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2023–24 విద్యాసంవత్సరం త్వరలో ముగియనుండగా ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం 20 శాతం మాత్రమే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసినట్లు తెలిపారు. దాదాపు రూ.4 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మోహన్ నాయక్, పవన్ కల్యాణ్, ధినేశ్, తదితరులు పాల్గొన్నారు.

16 వరకు ‘ఓపెన్’ డిగ్రీలో అడ్మిషన్లు

నర్సంపేట : డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 16 వరకు అవకాశం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్, కోఆర్డినేటర్ డాక్టర్ లకన్‌సింగ్ తెలిపారు. కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందడానికి ఓపెన్, రెగ్యూలర్ ఇంటర్, ఐటీఐ డిప్లొమా కోర్సులు చేసిన వ్యక్తులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాల కోసం స్టడీ సెంటర్ మొబైల్ నంబర్ 7382929577ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎల్.సత్యనారాయణ, డాక్టర్ బి.రమేశ్, ఎం.సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘అక్షర’లో ఎమ్మెల్సీ ఓటరు నమోదు



నర్సంపేట : పట్టణంలోని అక్షర స్కూల్‌లో ప్రిన్సిపాల్ జ్యోతి ఆధ్వర్యంలో మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ పట్టణ ఇన్‌చార్జ్ రమేశ్ మాట్లాడారు. గతంలో నమోదు చేసుకున్న పట్టభద్రులు సైతం నమోదు చేసుకోవాల్సిందేనని చెప్పారు.

ఆర్థికసాయం

నర్సంపేట : మండలం లక్నెపల్లికి చెందిన విద్యుత్ ఉద్యోగి రాయరాకుల రాజేందర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి స్థానిక భగత్‌సింగ్ యూత్ క్లబ్ అధ్యక్షుడు రాజులపాటి నగేశ్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.10,116లు సాయం అందజేశారు. కార్యక్రమంలో యూత్ క్లబ్ సభ్యులు గొట్టపర్తి శ్రావణ్, యాకూబ్, గొట్టపర్తి హరిశంకర్, మిడిమాలపు సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

ఆత్మకూరు : మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ రవిరాజు తెలిపారు. జాతీయ రహదారులపై నిఘా ఉంచి వాహనాలు ఆపకుండా రూట్ మ్యాప్ పాయింట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. మంగళవారం మండలంలోని ఆరెపల్లి క్రాస్ నుంచి ఆత్మకూరు మండల మహ్మద్ గౌస్‌పల్లి వరకు ట్రాఫిక్ పాయింట్లను పరిశీలించారు. ఓఆర్ఆర్ వద్ద డిస్నీల్యాండ్ స్కూల్ సమీపంలో, గూడెప్పాడ్ క్రాస్ ఎస్ఎస్ఆర్ హోటల్ సమీపం, నీరుకుళ్ల క్రాస్ వద్ద, కటాక్షపురం చెక్ పోస్ట్ వద్ద నాలుగు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న బావులకు అడ్డుగా గోడలు నిర్మించి ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దారులకు ఇరువైపుల ఉన్న పొదలు, జంగల్ కట్టింగ్ చేసి శుభ్రం చేసినట్లు తెలిపారు. కటాక్షపురం లోలెవల్ వంతెన వద్ద రేడియం స్టిక్కర్లు అంటించినట్లు తెలిపారు. మేడారం జాతరకు రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీ వలన వాహనాలు రోడ్లపై ఆపకుండా పోలీసులు పర్యవేక్షణ చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ప్రసాద్, రాజేశ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల గుర్తింపు



ఖానాపురం : మండలంలో 20 రోజులుగా బడికి రాకుండా బడి బయట ఉంటున్న పిల్లల గుర్తింపు కార్యక్రమాన్ని సీఆర్పీలు చేపట్టారు. అలాంటి బాలల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. బడి మానేసిన వారిని మళ్లీ బడిలో చేర్పించడానికి మండలవ్యాప్తంగా వివరాలు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా 21 మందిని గుర్తించారు. సదరు విద్యార్థులు స్కూల్‌కు వెళ్లేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

‘గృహజ్యోతి’లో జాగ్రత్తలు పాటించండి



వినియోగదారుడి నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్న సిబ్బంది

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకం కోసం అర్హుల వివరాల నమోదులో జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ సిబ్బందికి ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ వి.మోహన్‌రావు సూచించారు. పట్టణంలో గృహజ్యోతి పథకం కోసం ధ్రువపత్రాల నమోదు ప్రక్రియను డీఈఈ భిక్షపతి, ఏఏఓ శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి డైరెక్టర్ మోహన్‌రావు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వీస్ నంబర్, వివరాలతోపాటు ఇంటి యజమాని నుంచి రేషన్ కార్డు నంబర్, ఆధార్ జిరాక్స్‌లను తీసుకుని నమోదు చేయాలని చెప్పారు. పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో జేఎల్‌ఎం ప్రశాంత్, కంప్యూటర్ అసిస్టెంట్ సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత మహిళలకు ‘సఖి’ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీలత

పర్వతగిరి : గృహహింస, అదనపు కట్నం వేధింపులు, తదితర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలకు సఖి కేంద్రంలో పలు సేవలు అందుతాయని నిర్వాహకురాలు పల్లె శ్రీలత తెలిపారు. మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్ ప్రశాంతి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆశ వర్కర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలను అమలు చేస్తున్నాయని, సదుపాయాలు కల్పిస్తున్నాయని తెలిపారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళలు, బాలికలు ఎలాంటి సమస్యలున్నా 181, 100 నంబర్లకు ఫోన్ చేసి సాయం పొందాలని చెప్పారు. బాధిత మహిళలకు సఖి కేంద్రంలో తాత్కాలిక వసతి, కౌన్సిలింగ్‌తోపాటు పోలీసు, న్యాయ, ఇతర సేవలు అందుతాయని తెలిపారు. తల్లిదండ్రులు బాలబాలికలను సమ దృష్టితో పెంచాలని, ఆడపిల్లల అంశాలపై మగ పిల్లలను కూడా సెన్సిటైజ్ చేయాలన్నారు. సమావేశంలో సఖి సెంటర్ కౌన్సిలర్ నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వర్ధన్నపేట : ఐక్యపోరాటాలతోనే సమస్యలు పరిష్కారమౌతాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్ తెలిపారు. ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను స్థానిక సివిల్ సప్లయిస్ గోదాం వద్ద మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని విమర్శించారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా 4 కోడ్‌లుగా విభజించిందని మండిపడ్డారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, తదితర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈనెల 8న వరంగల్‌లోని డీసెంట్ ఫంక్షన్ హాలులో ఆల్ ట్రేడ్ యూనియన్స్ సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. సదస్సుకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ల్యాదెళ్ల ఆరోగ్యం, జలగం మోహన్, తుమ్మల వేణు, ఎలుమకంటి భుజంగం, జలగం రవి, ఉప్పునూతుల శ్రీనివాస్, కొండేటి శ్రీనివాస్, రవి, ఐతరాజు, జలగం సామేల్, శ్రీకాంత్, బాబు, ఎలుకంటి వేణు, వెంకన్న, సుమన్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



అమరవీరుల స్తూపం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

● ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా

నర్సంపేట : భువనగిరి ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థినుల అనుమానాస్పద మృతి కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడారు. విద్యార్థినులది హత్యేనని అనుమానం వ్యక్తం చేశారు. వార్డెన్, ఆటోడ్రైవర్ కలిసి హత్య చేసి ఉంటారని తెలిపారు. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేశారన్నారు. రెండ్రోజులు గడచినా ప్రభుత్వం నిందితులను గుర్తించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ చేపట్టి నిందితులను శిక్షించడంతోపాటు బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్, నిఖిల్, వంశీ, శ్రీకాంత్, సంతోశ్, మోహన్, కిశోర్, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో..

విద్యార్థినుల మృతిపై విచారణ చేపట్టి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి రాజేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు ఆబర్ల విక్రం, సహాయ కార్యదర్శి ప్రశాంత్, నాయకులు శివ, అనిల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చెన్నారావుపేట : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని జయముఖి కళాశాల సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన లింగాల దేవేందర్ తన ద్విచక్ర వాహనంపై నర్సంపేటకు వెళ్తున్నాడు. మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన ఆవుల మల్లయ్య తన ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం నర్సంపేటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ఆవుల మల్లయ్య, దేవేందర్ గాయాల పాలయ్యారు. స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

బస్సు సర్వీసు వినియోగించుకోండి

ఆత్మకూరు : మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులు స్థానిక బస్టాండ్‌లో రాణిగంజ్ డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు సర్వీసులను వినియోగించుకోవాలని సికింద్రాబాద్ డిప్యూటీ ఆర్ఎంఓ భీంరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన సికింద్రాబాద్ డిప్యూటీ ఆర్ఎంఎం సురేశ్ చౌహాన్, రాణిగంజ్ డిపో మేనేజర్ లక్ష్మీధర్మాతో కలిసి ఆత్మకూరు బస్టాండ్‌ను పరిశీలించి మాట్లాడారు. డిపోకు చెందిన 35 బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కండక్టర్ గుండెబోయిన రమేశ్ పాల్గొన్నారు.